నేడు ఎమ్మెల్యే పర్యటన

తొగుట,జనవరి 17: మండల కేంద్రంలో శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి దుబ్బాక ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

పరామర్శ

గుండారంలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, జనవరి 17: మండలంలోని బేగంపేట, కల్లెపల్లి, గుండారం గ్రామాలకు చెందిన పలువురిని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించారు. బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొరివి తిరుపతి కుమార్తెకు గాయాలుకాగా, మామిడి లక్ష్మణ్ అనారోగ్యం, కల్లెపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మామిడ్ల తిరుపతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, గుండారం గ్రామానికి చెందిన పర్కాల లక్ష్మీ నర్సయ్య, గైని వజ్రవ్వ ఇటీవల మరణించగా మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, రాజయ్య, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్ బాబు, మోహన్, దేవరాజు, రామలింగారెడ్డి, అంజయ్య, రాములు, నరేశ్, దుర్గ సుదర్శన్, రాజు, శ్రీనివాస్, మహేశ్ ఉన్నారు.

మల్లన్న క్షేత్రంలో పర్యటించిన పోలీస్ అధికారులు

ఏర్పాట్లపై ఆలయ ఈవో, ప్రధానార్చకుడితో చర్చిస్తున్న ఏసీపీ సతీశ్

చేర్యాల, జనవరి 17: పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి భారీగా భక్తులు రానుండడంతో శుక్రవారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సైరాజుతో కలిసి మల్లన్న క్షేత్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్పెషల్ దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం తదితర ప్రదేశాలను సందర్శించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.టెంపుల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించి ఆలయ ఈవో కే.రామాంజనేయులకు పలు సూచనలు చేశారు.మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఏఈ సతీస్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

పరీక్షా సామగ్రిని అందజేస్తున్న మిత్రబృందం సభ్యులు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 17: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 110 మంది టెన్త్ విద్యార్థులకు మిత్ర మండలి -87 బృందం సభ్యులు శుక్రవారం పరీక్షా సామగ్రి వితరణ చేశారు. మొత్తం 110 మంది విద్యార్థులకు రూ. 11వేల విలువైన పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, జామెట్రీ బాక్సులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రమండలి -87 బృందం అధ్యక్షులు బూట్ల రాజమల్లయ్య, ఉపాధ్యక్షురాలు అయిలేని అనితాశ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్, గౌరవ సలహాదారు గౌరిశెట్టి రాజు, కోశాధికారి పెరుమాండ్ల శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు గుండోజు రాజేంద్రప్రసాద్, మోర చంద్రశేఖర్, నూతి రాజేశం పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లను నమ్మి మోసపోవద్దు

చేర్యాల, జనవరి 17: ఆన్‌లైన్ యాప్‌లను నమ్మి మోసపోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీను కోరారు. మండలంలోని ఆకునూరులో శుక్రవారం సీఐ శ్రీను ఎస్సై నిరేశ్‌తో కలిసి రోడ్డు, ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్ యాప్స్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలకు వివరించారు. పండ్లు, ఐస్ క్రీమ్స్‌పై ఆపర్ల పేరిట ప్రజలను ఆకర్షించి యాప్ నిర్వాహకులు ప్రజల నుంచి డబ్బులు దోచేస్తున్నారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆన్‌లైన్ వ్యా పారం చేయవద్దని, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు నమ్మవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేసి వివరాలు అందులో పొందుపర్చవద్దని, సైబర్ నేరం జరిగితే జాతీయ సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు

సిద్దిపేట, జనవరి17: సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కోమండ్ల విక్రంరెడ్డి కోరారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించి అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు నిమ్మ సురేందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్, శశిధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

కొమురవెల్లి, జనవరి 17: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఐనాపూర్‌కు చెందిన రుద్రారపు యాదమ్మ ఇటీవల మృతి చెందింది. శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. రసూలాబాద్‌కు చెందిన బోదువుల సోమమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణాగౌడ్, రసూలాబాద్ మాజీ సర్పంచ్ స్వామిగౌడ్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బూర్గు స్వామిగౌడ్, నాయకులు శ్రీను, ప్రభాకర్, సత్తయ్య, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

గజ్వేల్, జనవరి 17: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 455 మంది పాల్గొనగా అందులో అత్యుత్తమంగా ముగ్గులు వేసిన ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. విజయలక్ష్మి (ప్రథమ), ఎ. మంజుల (ద్వితీయ), కవిత(తృతీయ)తో పాటు 50 మందికి కన్సలేషన్ బహుమతులను రామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామరాజు అందజేశారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు: సీపీఎం

ముస్తాలలో జెండా ఆవిష్కరిస్తున్న కొంగరి వెంకట్‌మావో

చేర్యాల, జనవరి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో ఆరోపించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరగనున్న సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ముస్తాలలో శుక్రవారం సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా పరిపాలన కొనసాగిస్తున్నాయన్నారు. ఈ నెల 25న సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, అసంఘటిత, సంఘటిత రంగానికి చెందిన కార్మికులు తరలిరావాలని కోరారు. నాయకులు రేపాక కుమార్, గుండ్ర రవీందర్, కృష్ణమూర్తి, దానియల్, సత్తయ్య, సహదేవులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిద్దిపేట టౌన్: రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శంకర్‌నారాయణ

గజ్వేల్: రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

తొగుట: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికాంతారావు

సిద్దిపేట టౌన్, జనవరి 17: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నారాయణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని సిద్దిపేట ట్రాఫిక్ నిబంధనలపై లారీ ఓనర్స్, డ్రైవర్లకు శుక్రవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానవ తప్పిదాల కారణంగానే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. ఎస్సై గోపాల్‌రెడ్డి, ఏఎస్సై సదాశివరావు, రవాణా, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

ట్రాఫిక్ నిబంధనలపై యువత అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట వన్‌టౌన్, టూటౌన్ సీఐలు వాసుదేవరావు, ఉపేందర్ సూచించారు. సిద్దిపేట ఇస్లామియా కళాశాల,రాజీవ్ రహదారి రంగీలాదాబా చౌరస్తాలో యువత, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజేశం, కొమురయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదు

తొగుట,జనవరి 17: మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని తొగుట ఎస్సై రవికాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాల డాక్యుమెంట్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం

గజ్వేల్, జనవరి 17: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సీఐ సైదా సూచించారు. రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా చెడు అటవాట్లకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి వాహదారుడు తనిఖీ సమయంలో అన్ని రకాల డాక్యుమెంట్స్ చూపించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపించాలని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారుల సూచనలు పాటించాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మిరుదొడ్డి , జనవరి 17: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు సూచించారు. మిరుదొడ్డి టౌన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మట్ తప్పకుండా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బాలసదనంలో చిన్నారులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, జనవరి 17: బాల్యం విలువైనదని.. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు.సిద్దిపేట బాలసదనాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై పిల్లలకు అవగాహన కల్పించి చదువు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం శిశుగృహన్ని సందర్శించారు. భిక్షాటన చేస్తున్న అబ్బాయి, అమ్మాయిని బాలల సంరక్షణ అధికారులు గుర్తించి బాలసదనానికి తీసుకురాగా వారితో జడ్జి మాట్లాడి పాఠశాలలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కార్మిక అధికారి బాబా, మమత,రాజు, న్యాయసేవా సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

రాయపోల్ , జనవరి 17: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గాడి రాజు సూచించారు. దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లిలో బడిబయట ఉన్న పిల్లలపై శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయట ఉన్న బాల బాలికలను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమాన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ యశోద పాల్గొన్నారు.

వాహనదారులకు జైలు, జరిమాన

సిద్దిపేట టౌన్, జనవరి 17: మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ వివరాల ప్రకారం..సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి నర్సాపూర్,ఎంపీడీవో చౌరస్తాతో పాటు రాజీవ్‌రహదారిపై వాహనాలు తనిఖీ చేశామన్నారు.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మంది పట్టుబడగా సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరు పర్చారు.విచారణ జరిపిన న్యాయమూర్తి మందు బాబులకు రూ.25 వేల జరిమాన,అందులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

సిద్దిపేట,జనవరి17: సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25నుంచి 28 వరకు జరుగనున్న సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తామన్నారు. బహిరంగసభకు ముఖ్యఅతిథిగా సీపీఎం పొలిటీ బ్యూరో సభ్యురాలు బృందా కారత్, బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కారాములు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామునిగోపాల్ స్వామి, రాళ్ల బండి శశిధర్, సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు జాలిగాపు శిరీష, అర్బన్ మండల నాయకులు కొండం సంజీవ్ కుమార్, వంగ రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, అభిషేక్ బాన్, కళావతి, రఘునందన్, బాలమణి పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, జనవరి 17: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. మహాసభల విజయసూచికగా అన్ని గ్రామాల్లో సీపీఎం జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మోహన్ భగవత్ వైఖరిపై బీఎస్పీ నిరసన

హుస్నాబాద్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్, జనవరి 17: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వైఖరిపై బీఎస్పీ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి మోహన్ భగవత్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠరోజే నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని, 1947కు ముందు జరిగిన ఉద్యమం నిజమైన స్వాతంత్ర్య కాదని మోహన్ భగవత్ వ్యాఖ్యానించడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డేగల వెంకటేశ్, ఎనగందుల శంకర్, వేల్పుల రాజు, మారెపల్లి సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

జగదేవపూర్, జనవరి17: కులం పేరుతో దూషించిన ములుగు మండలం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు ఆధ్వర్యంలో జగదేవపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి గణేశ్, కోశాధికారి బాబు, ప్రచారకార్యదర్శి స్వామి, కనకయ్య ఉన్నారు.

ఫోన్ల అప్పగింత

సిద్దిపేట టౌన్, జనవరి 17: పోయిన ఫోన్లను అధునాతన టెక్నాలజీ వినియోగించి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వనటౌన్ పరిధిలో లింగపల్లి వంశీ, గౌటే శివ, అజయ్‌కుమార్, టూటౌన్ పరిధిలో మల్లేశం పోన్లను పోగొట్టుకున్నారు. బాధితులు ఆయా పీఎస్‌లల్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేంద్రం తీసుకువచ్చిన సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి నూతన టెక్నాలజీ వినియోగించి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు సీఐలు వాసుదేవరావు, ఉపేందర్ అందజేశారు.

మోసపోయిన బాధితుడు

చేర్యాల, జనవరి 17 : తాను మున్సిపల్ కార్యాలయం నుంచి మాట్లాడున్నానని, మీ ఇంటి పన్ను, షాపు లైసెన్స్ ఫీజు, రెన్యువల్ ఫీజు వెంటనే చెల్లించాలి, లేని పక్షంలో షాపును సీజ్ చేస్తామంటూ ఓ అగంతకుడు పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద ఓ షాపు యజమానికి శుక్రవారం పలుమార్లు ఫోన్ చేశాడు. మున్సిపల్ కార్యాలయానికి రూ.9999 బకాయి ఉన్నావు వెంటనే చెల్లించు, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని పలుమార్లు ఫోన్‌కాల్స్ రావడంతో మున్సిపల్ కార్యాలయం నుంచి సిబ్బంది వచ్చి షాపు సీజ్ చేస్తే పరువు పోతుందని భావించిన సదరు యజమాని రూ.9999 ఫోన్ పే చేశాడు. డబ్బులు పంపించిన అనంతరం మున్సిపాలిటీకి వెళ్లిందా లేదా అనే అనుమా నం వచ్చిన భవనం యజమాని ఫోన్ పే చెక్ చేసుకోవడంతో జానీ అనే పేరు కనిపించింది. వెంటనే ఉదయం నుంచి కాల్స్ వచ్చిన నెంబర్‌కు ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్‌గా ఉంది. మోసపోయానని గుర్తించిన యజమాని పోలీసులను ఆశ్రయించడంతో పాటు 1930కు ఫిర్యాదు చేశాడు.

సర్వేను వేగవంతం చేయాలి

జాలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

జగదేవపూర్ మండల కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పీసీఈవో రమేశ్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 17: గ్రామాల్లో కొనసాగుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. శుక్రవారం ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈనెల 21 వరకు సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింహాచలం మధుసూదన్, ఏవో అఫ్రోజ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మీసాగర్, ఆర్ఐ రవీందర్, ఏఈవోలు రాధిక, అనూష, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

జగదేవపూర్, జనవరి 17: సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని జడ్పీ సీఈవో రమేశ్ అధికారులకు సూచించారు. మండల కార్యాలయాన్ని సందర్శించిన ఆయన 2022-23, 2023-24 వార్షిక ప్రజాపాలన నివేదికలను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈజీఎస్ కూలీలకు జాబ్ కార్డ్స్ అందించడంతో పాటు వారికి పని కల్పించాలని, పని చేసిన కూలీలకు పేమెంట్స్ వేగంగా చెల్లింపు అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఈనెల 21నుంచి 24 వరకు గ్రామపంచాయతీల్లో సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి యాదగిరి, సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఎంపీవో ఖాజామోహినొద్దీన్, టీఏలు, ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పక్కాగా చేయాలి

సిద్దిపేట, జనవరి 17: ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డుల సర్వేను అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. పట్టణంలోని రెండు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ వెంట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ నాయిని చంద్రం ఉన్నారు.

పథకాలు అందించడానికే ఇంటింటి సర్వే

మిరుదొడ్డి, జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికే ఇంటింటి సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో గణేశ్ రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణకుమార్ అన్నారు. మిరుదొడ్డి టౌన్‌లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పూర్తి వివరాలను అధికారులకు అందించి లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహారుద్రయాగం

జగదేవపూర్, జనవరి17: మధ్యప్రదేశ్‌లోని జ్యోతిర్లింగ క్షేత్రం, శక్తిపీఠం ఉజ్జయిని క్షేత్రంలో ఐదోరోజు మహారుద్రయాగం కొనసాగింది. అదరాసుపల్లి మధుసూదన శర్మ నేతృత్వంలో నిర్వహిస్తున్న మహారుద్ర యాగంలో భాగంగా శుక్రవారం లక్ష్మీ సూత్ర పారాయణం, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, హవనం, కాళీమాతకు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. మహారుద్రయాగంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు అప్పాల సత్యనారాయణ, భైరవభట్ల మృత్యుంజయశర్మ, చక్రధరశర్మ, పాండురంగ ఆశ్రమ వేద పండితులు అప్పాల మాధవశర్మ, భావానందశర్మ, గజ్వేల్‌కు చెందిన వేదపండితులు శ్యామ్‌ప్రసాద్, సనాతనశర్మ, బార్గవసాయి, ఆర్యవైశ్య సంఘం నాయకులు బుద్ధమహేందర్, రావికంటి చంద్రశేఖర్, గబ్బుశ్రీనివాస రావు,అయిత రాములు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట టౌన్,జనవరి 17 : బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు.పట్టణంలోని బ్యాంక్ మేనేజర్లు,అంతర్గత భద్రత సిబ్బంది పనితీరు తదితర అంశాలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఐ వాసుదేవరావు,ఉపేందర్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలను నివార